ఇంటి వద్దకే ఫ్యామిలీ ఫిజీషియన్

రామచంద్రాపురం: గతంలో పేదలకు వైద్యం అందని ద్రాక్షలా ఉండేది. వ్యయప్రయాసల కోర్చి మైళ్ల దూరంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. అక్కడ వైద్యులు అందుబాటులో ఉండేవారు కాదు. దీనికితోడు మందులు ఉండే పరిస్థితి లేదు. ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వచ్చేది. తద్వారా తాము సంపాదించిన అరకొర ఆదాయంలో ఎక్కువ భాగం వైద్యానికి ఖర్చు చేసేవారు. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులైతేనే కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందని, రాష్ట్ర ప్రగతి కూడా సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించారు. ప్రతి రెండువేల మంది జనాభాకు ఒకటి చొప్పున వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటుచేశారు. అలాగే ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను తీసుకువచ్చారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా ఒక వ్యక్తి రోగాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించి సకాలంలో వైద్యం అందించడం ద్వారా వ్యాధి ప్రబలకుండా అరికట్టడానికి వీలవుతుంది. ఫ్యామిలీ వైద్యుడు రోగి ఆరోగ్యాన్ని ప్రతి నెలా పరీక్షించి అనారోగ్యానికి గల మూలకారణాన్ని తెలుసుకుని దానికి అనుగుణంగా మందులు అందజేస్తున్నారు. ప్రతి కుటుంబంలోని వ్యక్తుల ఆరోగ్య స్థితిగతుల సమాచారాన్ని పొందుపరచడం వలన వారికి వచ్చే వ్యాధులకు సత్వర వైద్యం అందుతోంది. ఒకవేళ నయం కాని వ్యాధులు ఉన్నవారిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. రామచంద్రాపురం మండలంలో అనుపల్లి, నెత్తకుప్పం, సీకాలేపల్లి, మిట్టకండ్రిగ, గంగిరెడ్డిపల్లి, సీరామాపురం, నడవలూరు, కేకేవీపురం, నెన్నూరు గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటుచేశారు. ఇందులో 12 రకాల వైద్య సేవలు అందిస్తున్నారు. 14 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. ప్రతి క్లినిక్‌లోనూ 74 రకాల మందులు అందుబాటులో ఉంచారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లను అందుబాటులో ఉంచారు. సీజనల్ వ్యాధులతోపాటు మలేరియా, డెంగీ, చికున్‌గునియా, బోదకాలు వంటి జబ్బులు రాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయడం తదితర పనులు చేస్తున్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హేమలత

ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో
చికిత్స పొందుతున్న వారి వివరాలు

వ్యాధి	చికిత్స పొందుతున్న వారి సంఖ్య
బీపీ	1149
డయాబెటిస్	986
జనరల్ ఓపీలు	1079
క్యాన్సర్	7
గర్భిణులు	254
బాలింతలు	90

పీహెచ్‌సీకి వెళ్లాలంటే రెండు బస్సులు మారాలి



గతంలో మా గ్రామం నుంచి పీహెచ్‌సీకి వెళ్లాలంటే రెండు బస్సులు మారాల్సి వచ్చేది. దీంతో చాలా ఇబ్బంది పడేవాడిని. స్థానికంగానే డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటుచేయడంతో ఇబ్బందులు తప్పాయి. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వలన సకాలంలోనే వైద్య పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు.
– శంకర్ రెడ్డి, అనుపల్లి

మా ఇంటివద్దనే వైద్యం అందుతోంది



గత ప్రభుత్వ హయాంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే మండల కేంద్రంలోని పీహెచ్‌సీలకు వెళ్లాల్సి వచ్చేది. అక్కడ మందులు ఉండేవి కాదు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. జగనన్న పాలనలో వైద్యులు ఇంటి వద్దకే వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారు. వ్యయప్రయాసలు లేకుండా సత్వర వైద్యం అందుతోంది.
– సుబ్రమణ్యంరెడ్డి, పీవీపురం

గ్రామాల్లో సత్వర వైద్యం అందిస్తున్నాం



ప్రభుత్వం ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. ఒక ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లను నియమించింది. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా నెలలో రెండు సార్లు గ్రామాలకు వెళ్లి బాలింతలు, గర్భిణులు, బీపీ, షుగరు రోగులను పరీక్షించి మందులు ఇస్తున్నాం.
– డాక్టర్ హేమలత, వైద్యాధికారి, కమ్మపల్లి పీహెచ్‌సీ

నేడు డయల్ యువర్ కమిషనర్

తిరుపతి తుడా: ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ప్రజలు ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు 0877–2227208కి కాల్ చేసి సమస్యలను తెలియజేయవచ్చన్నారు. అలాగే ఉదయం 10:30 నుంచి నేరుగా అధికారులకు ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు.

అన్నదాతలకు చెవిరెడ్డి కుటుంబం అండ


అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): రైతన్నలకు చెవిరెడ్డి కుటుంబం అన్ని వేళలా అండగా ఉంటుందని చంద్రగిరి ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహకారంతో వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం చంద్రగిరి వారపు సంతలో రైతులు, వ్యాపారులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అన్నదానం చేశారు. ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం సీఎం జగనన్న ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుంటే, చంద్రగిరి నియోజకవర్గ రైతుల కోసం చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సంతలో అన్నదానం చేస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీటీసీ దేయ్యాల మాధవరెడ్డి. వైఎస్సార్ సీపీ చంద్రగిరి టౌన్ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, మస్తాన్, శిరీష్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాతమ్మకు చెవిరెడ్డి సారె


సారెను సమర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లి పంచాయతీ కూచివారిపల్లి అరుంధతివాడలో ఆదివారం మాతమ్మ తిరునాళ్ల వైభవంగా జరిగింది. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి మాతమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించారు. హర్షిత్‌రెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పద్మజ పాల్గొన్నారు.

రేపటి నుంచి జగనన్న సురక్ష సభలు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలంలో మంగళవారం నుంచి జగనన్న సురక్ష సభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో దేవేంద్రబాబు తెలిపారు. మంగళవారం చిట్టేచెర్ల, బుధవారం దీన్‌దార్లపల్లె, 6న భాకరాపేట, 11న దిగవూరు, 12న నెల్లుట్లవారిపల్లె, 13న టీ.చట్టేవారిపాళెం, 18న తిప్పిరెడ్డిగారిపల్లె, 19న జంగావాండ్లపల్లె, 20న రంగన్నగారిగడ్డ, 25న చిన్నగొట్టిగల్లు సచివాలయాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎలాంటి రుసుము తీసుకోకుండా ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు.

20 ఆర్టీసీ దుకాణాలకు షోకాజ్ నోటీసులు

తిరుపతి అర్బన్: జిల్లాలో 20 ఆర్టీసీ దుకాణాలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతోపాటు జరిమానా విధించినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి టి.చెంగల్‌రెడ్డి తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వస్తువులను విక్రయిస్తుండడంతో షోకాజ్ నోటీలు ఇచ్చినట్లు చెప్పారు. తిరుపతి బస్టాండ్‌లోని 9, పుత్తూరులో 2, సూళ్లూరుపేటలో 4, గూడూరులో 2, వెంకటగిరిలో 2, వాకాడ బస్టాండ్‌లో ఒక దుకాణానికి జరిమానా విధించినట్లు చెప్పారు. దుకాణదారులు తమకు కేటాయించిన వస్తువులనే విక్రయించాలని, అంతేకాకుండా తమ కేటాయించిన ప్రదేశంలోనే వ్యాపారం చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎమ్మార్పీ ధరలకే వస్తువులను విక్రయించాలని వెల్లడించారు.

భక్తులకు అన్నదానం


భక్తులకు అన్నదానం చేస్తున్న అంజూరు

శ్రీకాళహస్తి: ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం తొట్టంబేడు తాలుకా లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు హాజరై భక్తులకు అన్నదానం చేశారు. లారీ అసోసియేషన్ సభ్యులు సుబ్రహ్మణ్యం, ప్రభాకర్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి, జయశంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

లోకకల్యాణార్థం.. చతుర్వేద హవనం


హోమం చేస్తున్న వేదపండితులు

తిరుపతి కల్చరల్ : తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవన ప్రాంగణంలో నిర్వహిస్తున్న శ్రీనివాస చతుర్వేద హవనం ఆదివారం నాలుగోరోజుకు చేరుకుంది. జాతీయ సంస్కృత వర్సిటీ ఆచార్యులు కుప్పా విశ్వనాథశర్మ మాట్లాడుతూ యజ్ఞయాగాదులను దర్శించడం ద్వారా సకల శుభాలు పొందవచ్చన్నారు. మంత్రపూర్వకంగా అగ్నిలో ఆహుతులను సమర్పిస్తే సిరిసంపదలు చేకూరుతాయని వెల్లడించారు. ఈ క్రమంలో వేదపండితులు ఉదయం చతుర్వేద హవనం, మధ్యాహ్నం చతుర్వేద పారాయణం నిర్వహించారు. సాంస్కృతిక వేదికపై ఎస్వీ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ ఉమా ముద్దుబాల బృందం ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం ఆకట్టుకుంది. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకులు ఎస్.శ్రీవాణి బృందం ప్రదర్శించిన వీణావాద్య సంగీత కచేరి శ్రవణానందకరంగా సాగింది. టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్ కుమార్, జేఈఓ వీరబ్రహ్మం, డీఈఓ భాస్కర్ రెడ్డి, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రాజెక్టు అధికారి ఆకెళ్ల విభీషణ శర్మ పాల్గొన్నారు.

లాన్ టెన్నిస్‌లో జ్యోత్స్న ప్రతిభ

శ్రీకాళహస్తి:ఇటీవల ఢిల్లీలో జరిగిన లాన్ టెన్నిస్ అండర్–19 విభాగంలో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన మామండూరు జ్యోత్స్న ప్రతిభ చూపింది. జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. ఆదివారం శ్రీకాళహస్తి పట్టణంలోని రిపబ్లిక్ క్లబ్‌లో అధ్యక్షుడు సిద్ధులగారి మురళి, కార్యదర్శి రూపేర్ ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు.

పండ్ల మొక్కల పంపిణీ


భాకరాపేట గ్రామ ప్రజలకు టెంకాయ మొక్కలు అందజేస్తున్న ఎంపీపీ

భాకరాపేట : పర్యావరణ పరిరక్షణలో భాగంగా తుడా పరిధిలోని మండలాల్లో మొక్కల పంపిణీ చేపట్టినట్టు చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి పేర్కొన్నారు. భాకరాపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు పెంచి గ్రామాల్లో పచ్చదనం నింపాలన్నారు. వృక్షాలతోనే మానవ మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేపట్టిన మొక్కల పంపిణీ కార్యక్రమం ద్వారా రెండు సంవత్సరాలు తరువాత అందమైన, ఆహ్లాదకరమైన, పచ్చదనం పరుచుకున్న గ్రామాలను చూడొచ్చని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవేంద్రబాబు, స్థానిక సర్పంచ్ సాకిరి భూపాల్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు గురుశంకర్, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం


ఏపీ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శులతో జిల్లా నేతలు

తిరుపతి అర్బన్: సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చేలా ముందుకు సాగాలని ఏపీ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ తెలిపారు. తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ పేదలకు అండగా నిలుస్తూ కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. ఎప్పటికప్పుడు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సమస్యలకు పరిష్కారం చూపించాలని సూచించారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.సునీల్‌కుమార్ మాట్లాడుతూ అసోసియేషన్ బలోపేతానికి కృషి చేయాలన్నారు. స్థానిక ఉద్యోగుల సమస్యల పరిష్కారం చూపాల్సిన బాధ్యత జిల్లా నేతలపై ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయి సమస్యలను ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ అధ్యక్షుడు సుధాకర్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎం.శంకరయ్య, కార్యదర్శి డి.గురుమూర్తి, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు జీవీ సత్యనారాయణ, కార్యదర్శి వి.రాజేంద్రన్, సలహాదారులు వై.శరత్ బాబు, డి.గురవయ్య, వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులు పుస్తకాలకే పరిమితం


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నేత పి.హరినాథరెడ్డి

తిరుపతి కల్చరల్: రాజ్యాంగం కల్పించిన హక్కులు నేడు పుస్తకాలకే పరిమితమయ్యాయని, పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి ఆరోపించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం సీపీఐ తిరుపతి జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో మహిళలు, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వారిని ఉపా చట్టం కింద అక్రమ కేసులు బనాయిస్తూ జైలులో పెడుతున్నారని దుయ్యబట్టారు. పత్రికలను కూడా స్వతంత్రంగా నడుపుకునే పరిస్థితి లేదని తెలిపారు. సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి ప్రయత్నిస్తున్న రచయితలపై కేసులు పెడుతున్నారని, అభ్యుదవాదులపై దాడులను ప్రశ్నిస్తే జైలు పాలు చేస్తున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాను సైతం తన గుప్పిట్లో ఉంచుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాల్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోయేందుకు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తమం భావాలకు అనుకూలంగా ప్రజలను మార్చి దేశంలో అధ్యక్ష పాలన తీసుకురావడం కోసం బీజేపీ కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగానే ప్రతిపక్షాలను నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో వామపక్ష భావజాలం పెరగాల్సిన అవసరం ఉందని, ఇలాంటి శిక్షణ తరగతులు మరిన్ని నిర్వహించాలని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి, కేవై.రాజా పాల్గొన్నారు.

ముగిసిన గరుడ పురాణ పారాయణం


గరుడ పురాణాన్ని పారాయణం చేస్తున్న పండితులు

తిరుమల: తిరుమలలోని నాద నీరాజనం వేదికపై ఆదివారం సాయంత్రం గరుడ పురాణ పారాయణం ముగిసింది. కోవిడ్ సమయంలో ప్రపంచ మానవాళిని రక్షించడానికి శ్రీవారి అనుగ్రహాన్ని కోరుతూ టీటీడీ పారాయణ యజ్ఞం చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ ఏడాది జనవరి 2న గరుడ పురాణ పారాయణం ప్రారంభమైంది. 180 రోజులుగా గరుడ పురాణంలోని ప్రతి శ్లోకం సారాంశాన్ని నేటి సమాజానికి అన్వయించి వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేసింది. తిరుపతి ఎస్వీ వేద విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య రాణి సదాశివ మూర్తి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కృష్ణమూర్తి పాల్గొని వ్యాఖ్యాత, శ్లోక పారాయణకర్తల నైపుణ్యాన్ని అభినందించారు. శ్లోకాలను వివరించిన సత్యకిషోర్ మాట్లాడుతూ వేదవ్యాసుడు అష్టాదశ పురాణాలను లోకానికి అందించారని తెలిపారు. అందులో ధర్మబద్ధమైన జీవితాన్ని గడపడం ద్వారా పరమాత్ముడిని చేరడమే అంతిమ లక్ష్యమనే విషయాన్ని ప్రపంచానికి తెలియజేశారని పేర్కొన్నారు. గరుడుడు, విష్ణువు మధ్య జరిగిన అద్భుతమైన సంభాషణను గరుడ పురాణం రూపంలో ఉందని తెలిపారు. గరుడ పురాణంలో మరణం తరువాత జీవితం, ఆత్మ ప్రయాణం, మరణం, దాని అనంతర పరిణామాలు, పునర్జన్మ గురించి వివరిస్తుందని తెలిపారు. గరుడ పురాణంలోని విషయాలను వినడానికి భక్తుల్లో అపోహలు, సందేహాలు ఉన్నాయన్నారు. గరుడ పురాణమనేది జీవితపు నిజమైన ప్రయాణాన్ని తెలుసుకోవడానికి, మానవాళికి జ్ఞానోదయం కలిగించే గొప్ప ఆధ్యాత్మిక గ్రంథమని వివరించారు. ముందుగా ఎస్వీ సంగీత, నృత్య కళాశాలకు చెందిన చిన్నమదేవి అన్నమాచార్య కృతి ఇటు గరుడను నీవెక్కినను అందించారు. ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్‌కుమార్ వేదపండితులను సన్మానించారు.

ఈసెట్ ఫలితాల్లో గగన విద్యార్థుల ప్రతిభ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాల కోసం డిప్లొమా విద్యార్థులకు నిర్వహించిన ఈసెట్ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని శ్రీగగన విద్యాసంస్థ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆ సంస్థ డైరెక్టర్ కరుణామూర్తి తెలిపారు. 20 మంది రాష్ట్ర స్థాయిలో 500 లోపు ర్యాంకులు సాధించారని, 30 మంది వెయ్యిలోపు ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు.

చార్టెడ్ అకౌంటెంట్‌కు సత్కారం


ఫాల్గుణకుమార్‌ను సత్కరిస్తున్న అంజి, అసోసియేషన్ నేతలు


తిరుపతి కల్చరల్: ఏపీ రాష్ట్ర ఇన్‌కమ్ ట్యాక్స్ సలహా మండలి సభ్యుడిగా నియమితులైన ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఫాల్గుణకుమార్‌ను హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. తిరుపతి నగరంలోని ఒక ప్రైవేటు హోటల్లో ఆదివారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్లీస్ హోటల్స్ అండ్ రెస్టారెంట్ అధినేత అంజి తన బృందంతో కలిసి ఫాల్గుణకుమార్‌ను సన్మానించారు.

ప్రైవేట్ సంస్థల్లోనూ రిజర్వేషన్లు


మాట్లాడుతున్న అంబేడ్కర్ భవన్ అధ్యక్షుడు ఆనందయ్య

పాకాల : కార్పొరేట్, ప్రైవేట్ సంస్థల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని అంబేడ్కర్ భవన్ అధ్యక్షుడు ఆనందయ్య డిమాండ్ చేశారు. పాకాలలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం భారత రాజ్యాంగం – పరిరక్షణ అనే అంశంపై కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం సోదరభావంతో మెలిగినప్పుడే కుల వివక్షను రూపమాపవచ్చని తెలిపారు. ప్రజాస్వామ్యం విలువలతో జీవించినప్పుడే సమానత్వం వస్తుందని పేర్కొన్నారు. భూమిని జాతీయం చేయడం, వ్యవసాయం చేసేవారికి భూమిని పంచడం, విద్యావంతులకు ఉద్యోగం, ఉపాధిని కల్పించడం, జాతీయ వనరులను జాతీయం చేయడం ప్రస్తుత సమాజంలో అత్యవసరమన్నారు.

ఘనంగా ముగిసిన కపిలేశ్వరస్వామి పవిత్రోత్సవాలు


కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారికి హారతి సమర్పిస్తున్న అర్చకుడు


పవిత్రాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు, ఆలయ అధికారులు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహించిన పవిత్రోత్సవాలు ఆదివారం మహా పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం యాగశాలపూజ, హోమం, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, మూలవర్లకు కలశాభిషేకం, పట్టు పవిత్ర సమర్పణ చేపట్టారు. సాయంత్రం సోమస్కంధమూర్తి, కామాక్షి అమ్మవారు, విఘ్నేశ్వరస్వామి, సుబ్రమణ్యస్వామి, చండికేశ్వరస్వామి వారి వీధి ఉత్సవం వేడుకగా నిర్వహించారు. భక్తులకు పవిత్ర మాల, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో కె.సుబ్బరాజు, కంకణభట్టార్ ఉదయకుమార్ గురుకుల్, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

ఓటేరులో ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న సాయిమాక్స్ కేర్ వైద్య బృందం

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం ఓటేరు గ్రామంలో ఆదివారం సాయి మాక్స్ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సామాజిక సమరసత వేదిక జిల్లా అధ్యక్షుడు సూర్య కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో సుమారు 150 మంది గ్రామస్తులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. హాస్పిటల్ అధినేత డాక్టర్ శిల్ప, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ భవ్య గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

రైతు బజారులో సబ్సిడీతో టమాటాల విక్రయం



తిరుపతి రైతు బజార్‌లో టమాటాలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

తిరుపతి అర్బన్: జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు తిరుపతి అన్నమయ్య సర్కిల్ సమీపంలోని రైతు బజారులో ఆదివారం కిలో టమాటాలు రూ.50ల చొప్పున విక్రయించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి టమాటాలను కొనుగోలు చేశారు. పలమనేరు నుంచి 5 టన్నుల కాయలను తరలించినట్టు అధికారులు తెలిపారు. అక్కడ తోపులాటలు జరగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఏఎంసీ మాజీ డైరెక్టర్ వెంకటరమణకు పితృవియోగం


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న హర్షిత్‌రెడ్డి

పాకాల : మండలంలోని ఉప్పరపల్ల పంచాయతీ రామిరెడ్డిగారి ఇండ్లు గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటరమణ తండ్రి మారయ్య(66) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఆదివారం ఉదయం గ్రామానికి చేరుకున్నారు. మారయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, సర్పంచ్ గౌరీశంకర్‌రాజు, ఎంపీటీసీ సురేష్, నాయకులు నంగా బాబురెడ్డి, భాస్కర్‌నాయుడు, మునిరత్నంరెడ్డి, అన్నాబాబు, నాగూర్, మోహన్, బాను, సుధ, ప్రదీప్, ప్రకాష్, రెడ్డి, శివ పాల్గొన్నారు.

సూర్యచంద్రకు డాక్టరేట్



తిరుపతి ఎడ్యుకేషన్ : ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగపు పరిశోధక విద్యార్థి పల్లి సూర్యచంద్ర డాక్టరేట్ డిగ్రీ పట్టా అందుకున్నారు. ఆయన ప్రొఫెసర్ పి.వెంకట సుబ్బారెడ్డి పర్యవేక్షణలో నావెల్ మిషన్ లెర్నింగ్ అప్రోచెస్ టు క్లాసిపై ది సెంటిమెంట్ వాల్యూ ఆఫ్ న్యాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ ఇన్ తెలుగు డేటా అనే అంశంపై పరిశోధన చేశారు.